క్లుప్తంగా

ఎస్టీఎఫ్ఐ ప్రధాన కార్యదర్శిగా చాప రవి


చాప రవి

ఆసిఫాబాద్: స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శిగా టీఎస్‌టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చాప రవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వైద్య శాంతి కుమారి, కాంపెల్లి ఉషన్న ఒక ప్రకటనలో తెలిపారు. కలకత్తాలో జరిగిన ఆల్ ఇండియా రజతోత్సవ మహాసభల్లో కేంద్ర కమిటీ సభ్యులుగా వెంకట్, జంగయ్య, శారద ఎన్నికైనట్లు తెలిపారు. మహాసభల్లో సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని తదితర 21 తీర్మానాలు చేసినట్లు పేర్కొన్నారు. సభ్యులు ఇందురావు, ప్రీతి, రమేశ్, హేమంత్ షిండే, రాజ్‌కమలాకర్ రెడ్డి, మహిపాల్, దుర్గయ్య, సుభాష్, మహసత్‌రావు, శ్రీనివాస్, తులసీరాం అభినందనలు తెలిపారు.

సింగరేణి డిస్పెన్సరీలో మెరుగైన సేవలు అందించాలి

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి డిస్పెన్సరీలో ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. సోమవారం బీజేపీ నాయకులు డిస్పెన్సరీని సందర్శించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జీఎం విజయ భాస్కర్ రెడ్డికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా అధికారుల నిర్లక్ష్యంతో రక్తపరీక్షల యంత్రం, ఎక్స్‌రే యంత్రం చెడిపోయి మరమ్మతులకు నోచుకోవడం లేదన్నారు. ఇక్కడ ఉన్న టెక్నీషియన్‌ను బెల్లంపల్లికి పంపించడంతో ఇతర పరీక్షలు లేక సరైన వైద్యం అందడం లేదన్నారు. చెడిపోయిన యంత్రాలకు వెంటనే మరమ్మతులు చేయించి నాణ్యమైన సేవలు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణకుమారీ, నాయకులు నవీన్‌గౌడ్, రామకృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

లింగాపూర్: మండలంలోని మారుగూడ ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీవో రామచందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, రిజిస్టర్‌లు పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని పేర్కొన్నారు.

దహెగాంలో భారీ వర్షం

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. నాలుగు రోజుల నుంచి వర్షం లేక ఉక్కపోత, ఎండతో ప్రజలు, రైతులు ఇబ్బంది పడ్డారు. వర్షం కురవడంతో పత్తికి, వరికి అనుకూలమని రైతులు హర్షంవ్యక్తం చేస్తున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు ఇళ్లకు చేరుకున్నారు.

'ప్రైవేట్ టీచర్లకు టీఆర్టీలో అవకాశం ఇవ్వాలి'

రెబ్బెన: ఎన్ఐఓఎస్ ద్వారా రెండు సంవత్సరాల టీటీసీ పూర్తి చేసిన ప్రైవేటు టీచర్లకు టీఆర్టీలో అవకాశం కల్పించేలా ప్రత్యేక చొరవ చూపాలని మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ కోరారు. సోమవారం కాగజ్‌నగర్‌లో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డెపల్లి రాంచందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంతో మంది పైవేటు టీచర్లు ఎన్ఐఓఎస్ ద్వారా 2 సంవత్సరాల కోర్సు పూర్తి చేసినా టీఆర్టీలో అవకాశం లేకపోవడంతో కోర్సుకు విలువ లేకుండా పోయిందన్నారు.

విద్యార్థులు ఉచిత ఫిజియోథెరపీ

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని పాఠశాలలో సోమవారం ఉచిత ఫిజియోథెరపీ తరగతులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ. .దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ నెలలో నాలుగుసార్లు నిర్వహిస్తున్నామని, 18 సంవత్సరాలలోపు విద్యార్థులు అర్హులన్నారు. ఉచిత ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫిజియోథెరపీ నిపుణులు సునీల్, సీఆర్‌పీలు శివరాం, రవీంద్రనాథ్, ప్రధానోపాధ్యాయులు కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

వంతెన పనులు ప్రారంభించాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న అప్పపల్లి గ్రామానికి సరైన రోడ్డు, వంతెన లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా నాయకుడు కార్తీక్ అన్నారు. సోమవారం అప్పపల్లి గ్రామం వాగుపై వంతెన లేక ఇబ్బందులు పడుతున్న వారితో కలిసి మాట్లాడుతూ గత సంవత్సరం వంతెన నిర్మాణ కోసం పనులు ప్రారంభించి పునాది దశలోనే వదిలేశారన్నారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉన్నతాధికారులను దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టీకానంద్, నవీన్, దేవాజీ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



చింతలమానెపల్లి మండలంలోని రుద్రాపూర్ గ్రామంలో ప్రధాన రహదారి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఇళ్ల మధ్యలో భూమి నుంచి తక్కువ ఎత్తులో ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వర్షాలు కురిసినపుడు ఇంటికి విద్యుత్ సరఫరా అవుతోందని ట్రాన్స్‌ఫార్మర్ ఆనుకుని ఉన్న ఇంటి యజమాని వాపోతున్నాడు. పలుమార్లు నిప్పురవ్వలు ఇంటిలో పడుతుండడంతో భయాందోళన చెందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇళ్ల మధ్యన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతంలోకి తరలించాలని స్థానికులు కోరుతున్నారు. - చింతలమానెపల్లి

పచ్చదనం పరిచిన అందాలు



జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కెరమెరి మండలంలోని ఘాట్ అడవులు ప్రయాణికులను అలరింపజేస్తున్నాయి. బాబేఝరి, టోకెన్ మోవాడ్, పిట్టగూడ గ్రామాలకు ఆనుకొని వందల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ అడవులు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ఏపుగా పెరిగిన చెట్లు, గుబురు పొదలు, పచ్చని పొలాలు, అందమైన లోయలు ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. - కెరమెరి


అందమైన లోయలు


పచ్చని పంటపొలాలు

ప్రైవేట్ చేతుల్లో వారసంత

- ఆదాయం కోల్పోతున్న పంచాయతీ
- సంతలో కానరాని మౌలిక సదుపాయాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


మండల కేంద్రంలోని వారసంత

తిర్యాణి: వారానికి సరిపడా కూరగాయలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు గాను చిన్న పట్టణంలో, మేజర్ గ్రామపంచాయతీల్లో సంత నిర్వహణను సంబంధిత గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. కాగా మండల కేంద్రంలో నిర్వహించే వారసంతకు ప్రతీ వారం వందల సంఖ్యలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వచ్చి తమకు కావాల్సిన వస్తువులు, సరుకులు కొనుగోలు చేస్తుంటారు. కానీ క్షేత్రస్థాయిలో వారసంత ప్రైవేటు వ్యక్తుల స్థలంలో కొనసాగుతుండడంతో కొనుగోలుదారులకు, వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రైవేటు స్థలంలో నిర్వహణ..

గ్రామపంచాయతీలకు ఇంటి పన్నులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులకు తోడు ఆయా గ్రామాల్లో నిర్వహించే వారసంత ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది. కానీ మండల కేంద్రంలో అందుకు భిన్నమైన పరిస్థితి ఉండటంతో పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది. మండలంలో వారసంత ఏర్పడి దాదాపు పదేళ్లు కావస్తున్నా నేటికీ సంత నిర్వహణకు అధికారులు ప్రభుత్వ స్థలం చూపించకపోవడంతో ప్రైవేటు వ్యక్తికి చెందిన స్థలంలోనే సంత నిర్వహణ జరుగుతోంది. దీంతో సదరూ భూయాజమని సంతలో ఏర్పాటు చేసే ప్రతీ దుకాణం నుంచి వారానికి రూ.50 చొప్పున వసూలు చేస్తున్నాడు. అయినప్పటికీ వారసంత స్థలంలో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అటు వినియోగదారులతో పాటు దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూరగాయలు విక్రయించుకునేందుకు ఎలాంటి షెడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో వ్యాపారులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. దీంతో పాటు సంత శివారులో కానీ మండల కేంద్రంలో కానీ మరుగుదొడ్లు లేకపోవడంతో ఒంటికి, రెంటికి బయటకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రైవేటు చేతుల్లో సంత నిర్వహణ ద్వారా గ్రామపంచాయతీ ఏడాదికి దాదాపు రూ.లక్ష వరకు ఆదాయం కోల్పోతోంది. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో మౌలిక సదుపాయాలు కల్పించి సంత నిర్వహణ చేపట్టాలని, లేదంటే ప్రస్తుతం సంత నిర్వహణ చేపడుతున్న స్థలాన్ని పంచాయతీ లీజుకు తీసుకుని కనీస వసతులు కల్పించాలని మండల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలం అందుబాటులో లేదు

మండల కేంద్రంలో వారసంత నిర్వహణ కోసం అందుబాటులో ప్రభుత్వం స్థలం లేకపోవడంతో పంచాయతీ ఆధ్వర్యంలో సంత నిర్వహణ చేపట్టడం లేదు. ప్రస్తుతం ప్రైవేటు స్థలంలో నిర్వహిస్తున్న సంతకు సంబంధించిన భూ యజమాని నుంచి ప్రతీ ఏడాది పారిశుద్ధ్య నిర్వహణ రుసుం వసూలు చేస్తున్నాం. - వేముల మల్లేశ్, ఎంపీడీవో

చేనేత కార్మికులను ప్రోత్సహిద్దాం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


చేనేత వస్త్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: చేనేత వస్త్రాలు ధరించడం ద్వారా చేనేత కార్మికులను ప్రోత్సహిద్దామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన బెజ్జూర్ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంస్థ– కోసిన, గోదావరిఖని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విక్రయ స్టాల్స్‌ను సోమవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలు నాణ్యతతో ఉంటాయని, కలెక్టరేట్‌లోని అన్ని శాఖల ఉద్యోగులు, సందర్శకులు స్టాల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్, హనీ స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో బెజ్జూర్ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంస్థ అధ్యక్షుడు కనకయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి..

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. సోమవారం మండలంలోని వట్టివాగు కాలనీలోని గిరిజన దిశ మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసి వంటసామగ్రి, తరగతి గదులు, పరిసరాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పోషక విలువలు కలిగిన రుచికరమైన వంటలు అందించాలన్నారు. విద్యార్థుల స్థాయికు అనుగుణంగా వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించాలని సూచించారు. డీటీడీవో రమాదేవితో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, సీఆర్‌పీ రవీందర్, హెచ్‌ఎం మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలు బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంతాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలను ప్రజలు వినియోగించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. సోమవారం మండలంలోని చిర్రకుంట గ్రామంలోని తెలంగాణ బ్యాంకు నూతన భవనంలోకి మార్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని రీజనల్ మేనేజర్ గిర్మాజీతో కలిసి రిబ్బన్ కట్ చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.1కోటి 25 లక్షల చెక్కు అందించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువ తెలంగాణ గ్రామీణ బ్యాంకులోనే రుణాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఖాతాదారులు బ్యాంకులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. బ్యాంకు మేనేజర్ సామ్రాట్, సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యాదగిరి, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లు, కల్వర్టులకు మరమ్మతులు చేయండి


వినతిపత్రం అందజేస్తున్న పోరుగ్రామాల ఆదివాసీలు

కెరమెరి: హట్టి నుంచి జోడేఘాట్ వరకు ఉన్న ప్రధాన రోడ్డుతో పాటు కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలని పోరు గ్రామాల యువజన సంఘం వ్యవస్థాపకుడు పెందోర్ రాజేశ్వర్ డీటీ సంతోష్‌కుమార్‌ను కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అనేక చోట్ల రోడ్డుకు గుంతలు పడడంతో పాటు పలు చోట్ల రోడ్డు కోతకు గురైంది. అనేక ప్రాంతాల్లో ఉన్న కల్వర్టులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ విషయమై గతంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు. ఆయన వెంట ఆదివాసీలు, యువజన సంఘాల సభ్యులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ

సిర్పూర్(టి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. సోమవారం సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో పర్యటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలో 75 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశామని, సకాలంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరైన పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, సత్యనారాయణ, సోహెల్ అహ్మద్, అఖిల్ అహ్మద్, హౌజింగ్ ఏఈ శైజోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


లింగాపూర్: విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యులు


సిర్పూర్(టి): మాత్రలు వేస్తున్న వైద్యులు


కౌటాల: మాత్రలు వేస్తున్న వైద్యాధికారి

కెరమెరి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా సోమవారం మండలంలోని ఆశ్రమ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు చెందిన 7780 మంది విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు పంపిణీ చేయాల్సి ఉండగా 5016 మందికి మాత్రలు వేసినట్లు వైద్యాధికారి సోహెల్, రియాజ్, సూపర్‌వైజర్ లక్ష్మీకాంత తెలిపారు. మిగిలిన వారికి ఈ నెల 18న వేయిస్తామన్నారు. చిన్నారుల్లో ఉన్న కడుపునొప్పి నివారణకు ఇవి ఎంతగానో ఉపయగపడతాయన్నారు. కొన్ని పాఠశాలల్లో ఎంఈవో ఆడే ప్రకాశ్ మాత్రలు వేశారు.

లింగాపూర్: మండలంలో సోమవారం జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పాఠశాలల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. సూపర్‌వైజర్ దత్తారాం, ల్యాబ్ టెక్నీషియన్ అసిస్టెంట్ అశోక్‌కుమార్, సంతోష్, సునీల్ ఏఎన్ఎం సంధ్యారాణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో సోమవారం లోనవెల్లి పీహెచ్‌సీ వైద్యురాలు నవత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విద్యార్థులకు నులిపురుగుల మందులు పంపిణీ చేశారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాత్రలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, నిర్మల, కవిత పాల్గొన్నారు.

కౌటాల: పిల్లల ఆరోగ్యంపై తప్పనిసరిగా శ్రద్ధ ఉంచాలని మండల వైద్యాధికారి పవన్‌కళ్యాణ్‌రెడ్డి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌వో పవిత్ర, సిబ్బంది రజిని, తదితరులు పాల్గొన్నారు.


పెంచికల్‌పేట్: మాత్రలు వేస్తున్న డాక్టర్ అర్షిన్

పెంచికల్‌పేట్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నులిపురుగు నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యురాలు అర్షిన్ మాట్లాడుతూ నులిగి పురుగులతో పిల్లల్లో శారీరక ఎదుగుదల లోపిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యాదగిరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బీమా దరఖాస్తుల స్వీకరణ


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈవో శ్రీవిద్య


అవగాహన కల్పిస్తున్న ఏఈవో అంజన్న

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి, చేడ్వాయి రైతువేదికల్లో ఏఈవోలు శ్రీవిద్య, గౌసియాబేగంలు సోమవారం రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా పట్టా పాసు పుస్తకాలు పొందిన రైతులు పట్టా పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, నామినీ వివరాలతో దరఖాస్తులు ఈనెల 13 వరకు సమర్పించాలని కోరారు.

కౌటాల: అర్హులైన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రేమలత అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు గుడ్లబోరి, మొగడ్‌దగడ్, ముత్తంపేట, గురుడుపేట, సాండ్‌గాం రైతువేదికల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా పట్టా పాస్‌బుక్ పొందిన రైతు బీమా చేసుకోవాలని సూచించారు. మృతి చెందిన రైతు కుటుంబాలకు బీమా ఎప్పటికప్పుడు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు అంజన్న, ఘనశ్యాం, సిద్ధార్థ, ఆదిత్య, రష్మిత, కవిత, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కోర్సులపై విద్యార్థులకు అవగాహన

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో ఉచిత ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులపై సోమవారం అవగాహన కల్పించారు. చెన్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై అవగాహన కల్పించారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు స్వయం వేదిక ద్వారా డిగ్రీ విద్యార్థులకు అందిస్తున్న ఉచిత సర్టిఫికెట్ ఆన్‌లైన్ కోర్సుల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ జనార్దన్, అధ్యాపకులు శారద, రాజేశ్వర్, దత్తాత్రేయ, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు

దహెగాం: మండలంలోని కుంచవెల్లి, బామానగర్ గ్రామాల సమీపంలో సోమవారం ట్రాక్టర్ బైక్‌ను ఢీకొనగా, ఇద్దరికి గాయాలయ్యాయి. ఒడ్డుగూడ గ్రామానికి చెందిన జునుగరి ప్రవీణ్, తిరుపతి మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి వస్తువులు కొనేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కుంచవెల్లి మీదుగా వస్తుండగా బామానగర్ సమీపంలో పీకలగుండం గ్రామానికి చెందిన ఆత్రం మారయ్య ట్రాక్టర్‌తో అతివేగంగా వీరి బైక్‌ను ఢీకొట్టాడు. బైక్‌పై ఉన్న జునుగరి ప్రవీణ్, తిరుపతికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని జూనియర్ సివిల్‌కోర్టు సిర్పూర్(టి) న్యాయవాదులు సోమవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆసిఫాబాద్‌కు చెందిన న్యాయవాది నరహరిపై కొంతమంది దాడి చేయడాన్ని నిరసిస్తూ.. బార్ అసోసియేషన్ పిలుపు మేరకు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. దాడి చేసిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్, న్యాయవాదులు రైస్ అహ్మద్, గంట కళ్యాణ్, ఎం.శంకర్‌రావ్, కిషోర్‌కుమార్, దయరాజ్ సింగ్, సీహెచ్ శ్రీనివాస్, గణపతి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై వెళ్లి.. సమస్యలు తెలుసుకొని


ట్రాక్టర్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

తిర్యాణి: బురదమయంగా మారిన రోడ్డు పరిస్థితిని, సమస్యలను స్వయంగా ట్రాక్టర్‌పై వెళ్లి ఎమ్మెల్యే కోవ లక్ష్మి తెలుసుకున్నారు. మండలంలోని దేవాయిగూడ పంచాయతీ పరిధిలోని చందుగూడ, తోయగూడ గ్రామాలకు వెళ్లడానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి సమస్య తెలుసుకోవడానికి సోమవారం గ్రామాల్లో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ సింగరేణి నిధుల ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.